సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



ఖాద్రీశా.. నమోనమః

కదిరి లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. 8లో



కిలో టమాట రూ.43

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.43, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

32.1°/21.9°

జిల్లాలో శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



కక్షిదారులతో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ

హిందూపురం అర్బన్: లోక్ అదాలత్ వల్ల కేసుల పరిష్కారం వేగవంతమవుతుందని, తద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. బాధితుల నుంచి సమస్యలను వినతుల రూపంలో జడ్జి స్వీకరించారు. ఇరువర్గాలతో చర్చించి కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. లోక్ అదాలత్‌కు హాజయ్యే అధికారులు, ఆయా కేసులకు సంబంధించిన సమగ్ర సమాచారంతో రావాలన్నారు. హిందూపురం రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ దుకాణాలను తొలగిస్తున్నారని పలువురు వ్యాపారులు లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, కోర్టు తీర్పు ఇవ్వకముందే దుకాణాలు తొలగించడం చట్టవిరుద్ధమన్నారు. హిందూపురంలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్, క్లినిక్‌ల నిర్వాహకులు బయోవ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని న్యాయవాది నవేరా లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, న్యాయవాదులు సుదర్శన్, సిద్ధూ, నాగరాజురెడ్డి, సంతోషికుమారి పాల్గొన్నారు.

కుళ్లిన వేరుశనగ.. ఒరిగిన వరి

- వర్షాలతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం



కుళ్లిన వేరుశనగను చూపుతున్న రైతు

పుట్టపర్తి అర్బన్: అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వేరుశనగ రైతు పరిస్థితి ముందుకెళ్తే నుయ్యి.. వెనక్కు వస్తే గొయ్యిలా మారింది. 62,410 హెక్టార్లలో సాగు చేసిన పంట.. తొలగించే సమయం ఆసన్నం కావడంతో ఈ వర్షాలకు పంట తొలగించినా నష్టమే, తొలగించకున్నా నష్టమేనని రైతులు చెబుతున్నారు. పంట తొలగించక పోతే చెట్లలోనే మొలకలు వస్తాయని, తొలగించినా కట్టె తడిసిపోయి మొలకలు, రావడం, కట్టె కుళ్లిపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇక ఖరీఫ్‌లో ముందస్తుగా వేసిన వరి కూడా ప్రస్తుతం కోతకు వచ్చింది. తాజా వర్షాలతో పంట నేలకు ఒరిగిపోయింది. దీంతో పొలంలోనే గింజలు రాలి మొలకలు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కంది కూడా పూత రాలిపోయింది. మరో మూడు రోజుల్లో మరో తుపాను వస్తుందన్న వాతావరణ శాఖ సూచనలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

28 మండలాల్లో కురిసిన వర్షం..

తుపాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకూ జిల్లాలోని 28 మండలాల్లో వర్షం కురిసింది. నల్లచెరువు మండలంలో అత్యధికంగా 58.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక తాడిమర్రి మండలంలో 48.4 మి.మీ, సీకేపల్లి 45.6, బత్తలపల్లిలో 42.4, ఎన్పీ కుంట 42.2, ధర్మవరం 38.4, గోరంట్ల 38.2, రామగిరి 29.8, అగళి 28.6, ముదిగుబ్బ 19.4, రొళ్ల 17.4, పెనుకొండ 15.4, బుక్కపట్నం 15, కనగానపల్లి మండలంలో 10.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మిగతా 14 మండలాల్లో 1.6 మి.మీ నుంచి 10 మి.మీ మేర వర్షం కురిసింది.

పింఛన్లు తొలగిస్తారా?



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్



పింఛన్ల తొలగింపు అంశంపై ఎమ్మెల్యే రాజును నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

పేదల కడుపు కొడతారా..

- గళమెత్తిన జెడ్పీటీసీ సభ్యులు
- భారీ వర్షాలతో అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయని ఆందోళన
- రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్
- తాగు, సాగునీటిపైనా సుదీర్ఘ చర్చ
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: రాజకీయ కక్షతో సామాజిక పింఛన్లు తొలగిస్తారా అంటూ జెడ్పీటీసీ సభ్యులు మండిపడ్డారు. భారీ వర్షాలతో అన్ని రకాల పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో శనివారం సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి సత్యకుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. పింఛన్ల తొలగింపు, రైతాంగం సమస్యలు, తాగు, సాగునీటి అవసరాలపై చర్చ సాగింది.

ఇప్పుడెందుకు అనర్హులయ్యారు?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల పింఛన్లు తొలగించడం దారుణమని కనగానపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు కుంపటి భాగ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు జోక్యం చేసుకుంటూ అనర్హుల పింఛన్లు మాత్రమే తొలగించామని చెప్పగా... జెడ్పీటీసీ సభ్యులందరూ ఒక్కసారిగా గళమెత్తారు. అన్ని అర్హతలు ఉన్న వారికే గతంలో పింఛన్లు మంజూరు చేశారని, వారంతా ఇప్పుడు ఎలా అనర్హులవుతారని నిలదీశారు. రాజకీయ కక్షతో పేదల కడుపు కొడితే మీకేమొస్తుందంటూ మండిపడ్డారు. జిల్లాలో 5,908 వృద్ధాప్య పింఛన్లు, 519 దివ్యాంగుల పింఛన్లు తొలగించినట్లు అధికారులే తమకు సమాచారం ఇచ్చారని, గతంలో అన్ని అర్హతలు ఉన్నాయని మంజూరు చేసిన అధికారులే ఇప్పుడు అనర్హులంటూ ఎలా తొలగిస్తారని చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, జెడ్పీటీసీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుని నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

భారీ వర్షాలతో పంటలన్నీ నాశనం

ఎడతెరిపి లేని వర్షాలతో అన్ని రకాల పంటలు నాశనమయ్యాయని, కోట్లాది రూపాయల పెట్టుబడి నేలపాలైనట్లు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో వేరుశనగ, సజ్జ పంట పూర్తిగా పాడైందని, వేరుశనగ భూమిలోనే కుళ్లిపోగా, ఆకు కూడా గ్రాసానికి పనికి రాకుండాపోయిందని అమడగూరు జెడ్పీటీసీ సభ్యురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో ఎక్కువగా మిరప సాగు చేస్తారని, ఆయా ప్రాంతాల్లో శీతల గిడ్డంగులు నిర్మిస్తే రైతులకు మేలు చేసిన వారవుతారని గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ సమావేశం దృష్టికి తెచ్చారు. వర్షాలతో వేరుశనగ పంట పాడైందని, రైతులకు ఉచితంగా విత్తన కాయలు సరఫరా చేయాలని విడపనకల్లు జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు విజ్ఞప్తి చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు నిల్వ లేవని, రైతులకు చిరుధాన్యాలు సరఫరా చేసి సాగు చేసేలా ప్రోత్సహించాలని కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు కోరారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి మండల తీర్మానం లేకుండా పంచాయతీ తీర్మానాలతో పనులు మొదలుపెడుతున్నారని బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులను పిలవకపోవడం ఎంత వరకు సమంజసమని సభ్యులు ప్రశ్నించారు. నల్లమాడ ఎంపీపీ సునీతబాయి మాట్లాడుతూ మండలానికి వేరుశనగ విత్తన కాయలు, ఎరువులు ఎన్నొచ్చాయనే వివరాలను వ్యవసాయాధికారులు తమకు తెలపడం లేదన్నారు. రామగిరి జెడ్పీటీసీ నాగార్జున మాట్లాడుతూ పేరూరు డ్యామ్‌కు నీరు వదలాలని, పెండింగ్ ఉన్న హంద్రీ–నీవా కాలువ పనులను పూర్తి చేయాలన్నారు.

చెరువులు నింపండి

తమ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నింపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. శ్రీసత్యసాయి జిల్లాలో పని చేసే ఏ శాఖ అధికారి కూడా జెడ్పీ సమావేశాలకు రావడం లేదని, కలెక్టర్ కూడా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలి. వచ్చే సమావేశం నాటికి సమస్యలు పరిష్కరించాలి. సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరికీ విధిగా ప్రొటోకాల్ పాటించాలి.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేద్దాం

రాజకీయంగా మీరంతా సీనియర్లు. నేను ప్రజాప్రతినిధిగా ఎన్నికై నాలుగు నెలలు మాత్రమే అవుతోంది. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేద్దాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అవసరమున్న చోట పీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ధర్మవరం నియోజకవర్గంలోని 49 చెరువులు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నింపాలని, ఇటీవల ఐఏబీ సమావేశంలో చర్చించాం. సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రయత్నించాలి. గ్రామీణ సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి. జెడ్పీ సమావేశాలకు తప్పనిసరిగా కలెక్టర్లు రావాల్సిందే. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందే విధంగా కృషి చేస్తాం.

– సత్యకుమార్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి

అధికారులు హాజరవ్వాల్సిందే

కలెక్టర్ సహా అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాల్సిందే. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటాం. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు గ్రామ, మండల, జిల్లా పరిషత్ అప్రూవల్ తీసుకోవాలి. జల్ శక్తి అభియాన్ కింద చెక్ డ్యామ్‌లు, ఫారంపాండ్లు, ఇతర పనులు చేపడతాం. పింఛన్ల తొలగింపు అంశానికి సంబంధించి నోటీసులు ఇచ్చిన వారి వద్దకు అధికారులే స్వయంగా వెళ్లి వివరాలు నమోదు చేయాలి.

– వినోద్‌కుమార్, అనంతపురం జిల్లా కలెక్టర్

మద్యం ధర.. గుండె దడ

- తక్కువ ధరకు మద్యం హామీ హుళక్కే
- చీప్ లిక్కర్ క్వార్టర్ రూ.130
- చాలా చోట్ల ఎమ్మార్పీకి మంగళం
- మోసపోయామంటున్న మందుబాబులు
- సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారిన సెటైర్లు



కదిరి: 'తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇస్తాం' అని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన చంద్రబాబు...అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కారు. నూతన మద్యం పాలసీ పేరుతో ఇన్నాళ్లు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. జిల్లాలోని 87 దుకాణాలకు టెండర్లు పిలిచి లాటరీ పేరుతో కూటమి నేతలకు కట్టబెట్టారు. మద్యం వ్యాపారులంతా సిండికేట్ కాగా, మద్యం ధర చూస్తేనే మందుబాబులకు కై పెక్కుతోంది. 'నమ్మినందుకు నడ్డివిరగొడుతున్నావు కదయ్యా' అంటూ మద్యం ప్రియులు మండిపడుతున్నారు.

చీప్ లిక్కర్ రూ.130..

తాము అధికారంలోకి రాగానే రూ.99కే క్వార్టర్ మద్యం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. జిల్లా వ్యాప్తంగా ఏ మద్యం దుకాణంలోకి వెళ్లి అడిగినా ఆ సరుకు ఇంకా రాలేదనే సమాధానమే వినబడుతోందని మద్యం ప్రియులు చెబుతున్నారు. చీప్ లిక్కర్ (క్వార్టర్) రూ.130గా ధర నిర్ణయించారని వారంతా గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కనిష్ట మద్యం (క్వార్టర్) ధర రూ.120 ఉండేదని మందుబాబులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం క్వార్టర్ పేరుకు రూ.130 అని చెబుతున్నా.. దుకాణాల్లో రూ.150 వసూలు చేస్తున్నారంటున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో టీడీపీ మద్యం పాలసీపై సెటైర్లు వేస్తూ పోస్టింగ్‌లు పెడుతున్నారు.

పేరుకే లాటరీ..

జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో 87 మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వగా...1,460 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల రుసుము వసూలు చేసింది. ఈ నెల 14వ తేదీన పుట్టపర్తిలోని సాయిఆరామంలో లాటరీ తీసి మద్యం దుకాణాలను కేటాయించారు. లాటరీ తీశాం...అంతా పారదర్శకమని అధికారులు చెబుతున్నా... 90 శాతానికిపైగా దుకాణాలు అధికార కూటమి పార్టీ నేతలు, వారి అనుచరులే దక్కించుకున్నారు. అందుకే వారు నిర్ణయించిందే ధర అన్నట్టు వ్యవహరిస్తున్నారని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ బ్రాండ్ ఎంత?

కొత్త మద్యం పాలసీ మద్యం ప్రియులను తీవ్ర నిరశకు గురిచేసింది. మెక్‌డోల్ విస్కీ క్వార్టర్ రూ.180, మ్యాన్షన్ హౌస్ రూ.220, రాయల్ స్టాగ్ రూ.230, బ్లెండర్స్‌ప్రైడ్ రూ.360, హండ్రెడ్ పైపర్స్ రూ.670, టీచర్స్ స్పెషల్ రూ.690గా ధర నిర్ణయించారు. అయితే మ్యాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ రూ.220 నుంచి రూ.260 వరకు, ఓల్డ్‌మంక్ బ్రాందీ రూ.270 దుకాణాల్లో అమ్ముతున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. స్ట్రాంగ్ బీర్లకు రూ.220 నుంచి రూ.270 దాకా తీసుకుంటున్నారని చెబుతున్నారు.

దుకాణం తెరిచారు..

జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు మద్యం వ్యాపారులతో రాయ'బేరం' నడిపారు. ప్రతి నెలా 20 నుంచి 30 శాతం కమీషన్ ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే కొందరు బహిరంగంగా చెబుతున్నారు. 'మీరు ఇక్కడ వ్యాపారం ఎలా చేసుకుంటారో నేనూ చూస్తా.. మీరేం చేసుకుంటారో..ఎంతకు అమ్ముకుంటారో మాకు అనవసరం. ప్రతి నెలా మేము చెప్పినంత కమీషన్ ఇవ్వాల్సిందే'అని బెదిరిస్తున్నారని మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు వాపోతున్నారు.

ఇంటింటికీ వెళ్లి చెబుతారా?



'ప్రజలకు నాణ్యమైన మద్యం అందిస్తున్నాం... మాది మంచి ప్రభుత్వం' అని ఇంటింటికీ వెళ్లి చెప్పే ధైర్యం బీజేపీతో జతకట్టిన చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నాయకులకు ఉందా?. తక్కువ ధరకే మద్యం అని చెప్పి ఆఖరుకు మందుబాబులను కూడా మోసగించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. నిత్యవసరాలు, కూరగాయల ధరల సంగతి చెప్పనక్కర లేదు.

– మీసాల వేమయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

అన్ని షాప్‌లు అధికార పార్టీవే



మద్యం దుకాణాలకు పేరుకే లాటరీ తీశారు. అన్నీ కూటమి నేతలకే దక్కాయి. ఒకటో, రెండో ఇతర పార్టీల నాయకులకు దక్కినా వారికి బెదిరింపులు తప్పడం లేదు. అప్పుడే జిల్లా వ్యాప్తంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారారు. బెల్ట్‌షాప్‌ల ఏర్పాటుకు కూడా అన్నిచోట్లా సన్నాహాలు చేసుకుంటున్నారు. రేట్లు కూడా అధికంగా ఉన్నాయని మా దృష్టికి వచ్చింది.

– బడా సుబ్బిరెడ్డి, జిల్లా కార్యదర్శి, రైతు సంఘం (సీపీఎం అనుబంధం)

మోసం బాబు నైజం



చంద్రబాబు గతంలో కూడా అన్ని వర్గాల ప్రజలనూ మోసగించారు. ఇప్పుడు నాణ్యమైన మద్యం..తక్కువ ధరకు మద్యం అంటూ మందుబాబులను మోసగించడంలో ఆశ్చర్యం లేదు. జిల్లాలో 65 ఉన్న మద్యం దుకాణాలను 87కు పెంచారు. ఇక ప్రతి పల్లెలో బెల్టు షాప్ ఏర్పాటుకు మద్యం వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారు. 'ప్రజల ఆరోగ్యంతో పనిలేదు.. మన జేబులు నిండితే చాలు' అన్న చందంగా చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నేతలు పనిచేస్తున్నారు.

– ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

ఇంకా స్టాక్ రాలేదు

రూ.99 క్వార్టర్ బ్రాండ్ జిల్లాకు ఇంకా రాలేదు. స్టాక్ ఎప్పుడొస్తుందో మాకు కూడా తెలియదు. ఆ స్టాక్ రాగానే జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలకు సమానంగా పంచుతాం. ఎంఆర్పీ కన్నా ఎక్కువ తీసుకున్నా, కల్తీ మద్యం అమ్మినా చర్యలు తీసుకుంటాం. అలాంటి దుకాణం లైసెన్సు రద్దు చేస్తాం.

–గోవిందు నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

వేతనాలివ్వకుండా వేధిస్తున్నారు

- ప్రభుత్వం బిల్లులిచ్చినా కాంట్రాక్టర్ చెల్లించడం లేదు
- సీపీడబ్ల్యూఎస్ స్కీం వర్కర్ల ఆవేదన

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వం బిల్లులు చెల్లించినప్పటికీ తమకు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ వేధిస్తున్నారని సమగ్ర రక్షిత నీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. దీంతో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. 'కదిరి నియోజకవర్గంలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, ఎన్పీ కుంట, కదిరి, తలుపుల మండలాలలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాం. 2019 సెప్టెంబరు వరకూ వేతనాలు, పీఎఫ్‌లు సక్రమంగా వచ్చాయి. ఆ తర్వాత కాంట్రాక్టు సంస్థ (శ్రీ లక్ష్మీ నరసింహ మెటల్) ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకున్నప్పటికీ.. మాకు మాత్రం వేతనాలు ఇవ్వలేదు. ఈ సంస్థ ఓ మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందినది. కాంట్రాక్ట్ సంస్థ అక్రమాలకు అధికారులు కూడా సహకరించారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టరును కలిశాం. జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లోనూ ఫిర్యాదు చేశాం. ఇకనైనా స్పందించి న్యాయం చేయాల'ని కోరారు.

23న సర్వజనాస్పత్రిలో మెడికల్ క్యాంపు

అనంతపురం మెడికల్: వినికిడి సమస్యతో బాధపడుతున్న 19 ఏళ్ల లోపు వారి కోసం ఈ నెల 23న అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో (ఓపీ నంబర్ 99 డీఈఐసీ)మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ

- బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైంది?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



దుద్దేబండలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ఓట్ల కోసమే సీఎం చంద్రబాబు బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. నిజంగా చంద్రబాబుకు బీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే 50 ఏళ్లున్న బీసీలకు పింఛన్ ఇస్తామన్న హామీ ఏమైందో చెప్పాలన్నారు. శనివారం ఆమె మండలంలోని దుద్దేబండ గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించేలా ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. బీసీలంటే బ్యాక్‌బోన్ వర్గాలని చెప్పిన వైఎస్ జగన్ ఆర్థికంగా, రాజకీయంగా అండగా నిలిచి ఎందరికో రాజ్యాధికారం కట్టబెట్టారన్నారు. తమది బీసీల పార్టీ అని చెప్పుకునే చంద్రబాబు బీసీలకు ఏం చేశారో చెప్పాలన్నారు. అబద్ధాలు, మోసాలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను నిండా ముంచారన్నారు. పైగా తమది మంచి ప్రభుత్వమంటూ స్టిక్కర్లు అతికించేందుకు సిద్ధం కాగా, జనం ఎక్కడికక్కడ నిలదీస్తున్నారన్నారు. చంద్రబాబు ఈ నాలుగు నెలల కాలంలో చేసింది ఏదైనా ఉంటే అది మద్యం దుకాణాలను కార్యకర్తలకు కట్టబెట్టి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమేనన్నారు.

సత్యసాయికి నృత్యాంజలి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఉత్తర కర్ణాటక భక్తులు



ప్రేమ నృత్యాంజలి నృత్య రూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ చిన్నారులు నిర్వహించిన నృత్యరూపకంతో భక్త కోటి పరవశించిపోయింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఉత్తర కర్ణాటక సత్యసాయి భక్తులు శనివారం సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసురాలు సంగీత రాజేష్ భండార్కర్ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నృత్యరూపకంతో సత్యసాయికి ప్రేమ నృత్యాంజలి సమర్పించారు. సత్యసాయి అవతార వైభవం, బోధించిన విలువలను చాటుతూ చక్కటి నృత్య భంగిమలతో ఆకట్టుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్కౌట్ పోటీలు ప్రారంభం



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం రాష్ట్ర స్థాయి స్కౌట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తాళ్లను ఎలా ముడివేయాలి, దిక్సూచి ఎలా ఉపయోగించాలి, ప్రథమ చికిత్స గురించి విద్యార్థులకు వివరించారు. ప్రమాదంలో ఉన్న పిల్లలను ఎలా కాపాడాలి, ప్రథమ చికిత్స ఏవిధంగా చేయాలి అనే అంశాలను లీడర్ ఆఫ్ ది కోర్సు ప్రసాద్, నాగరాజు తెలియజేశారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు 162 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, జిల్లా సెక్రెటరీ గిరిధర్, స్కౌట్ మాస్టర్లు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కరణం రమామణి సేవా ట్రస్ట్ చైర్మన్ కరణం రమానందన్ భోజనాలు ఏర్పాటు చేశారు.

కొట్లపల్లి వద్ద కాజ్‌వేకు గండి



గండి పడిన కాజ్‌వే

పుట్టపర్తి అర్బన్: కొట్లపల్లి వద్ద పెనుకొండ–పెడపల్లి ప్రధాన రహదారిపై నిర్మించిన కాజ్‌వేకు గండిపడింది. గాజులపల్లి చెరువు నిండడంతో వంగేపేరు ఉధృతంగా ప్రవహించింది. గతంలో కురిసిన వర్షాలకు కాజ్‌వే రక్షణ గోడ పూర్తిగా కూలిపోవడంతో కింది భాగంలో పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో ప్రస్తుతం ప్రవహిస్తున్న వర్షం నీరు సగం వరకు కింది భాగం గుండా వెళ్లిపోయింది. భారీ వాహనాలు దీనిపై తిరిగితే కాజ్‌వే పూర్తిగా కూలిపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు



రొళ్ల: సోమఘట్ట గ్రామ సరిహద్దు కర్ణాటక ప్రాంతం గోణిహళ్లి సమీపాన శనివారం మధ్యాహ్నం కేఎస్ ఆర్టీసీ బస్సు గుంతలను తప్పించబోయి రోడ్డుపక్కకు దూసుకెళ్లి ఆగింది. ఆ సమయంలో బస్సులో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారు. మరో మూడు మీటర్లు బస్సు ముందుకు కదిలి ఉంటే బోల్తాపడేది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును ఆపేయడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులుత ఎలిపారు. అనంతరం జేసీబీతో బస్సును బయటికి తీశారు.

పోలీసు అమరవీరులకు వందనం

- శాంతిభద్రతల్లో పోలీసుల పాత్ర కీలకం
- రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం



చంద్రశేఖర్ (పీసీ)



బాబావలి (పీసీ)



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం

పుట్టపర్తి టౌన్: దేశ భద్రతలో సైనికులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులది కీలకమైన పాత్ర. విధి నిర్వహణలో ఒక్కోసారి అసాంఘిక శక్తుల చేతిలో వీర మరణం పొందుతుంటారు. అలాంటి వారిని స్మరించుకుంటూ.. సమాజంలో వారి కీలకమైన పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా 21వ తేదీ నుంచి పది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎస్పీ రత్న ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు సమావేశం నిర్వహించి, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

- ఈ నెల 22 నుంచి 30 వరకు అమరులైన పోలీసుల గ్రామాల సందర్శన, వారి సేవలు స్మరించడం, 24 నుంచి 27 వరకు చర్చావేదిక, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. ఈ నెల 26 పోలీసులు, పోలీసుల త్యాగాలు పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శన, 26 నుంచి 27 వరకు ఓపెన్ హౌస్ నిర్వహణ, 27న ఆయుధాల ప్రదర్శన విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. 28న వైద్య శిబిరాలు, అదేరోజు పోలీస్ వాయిద్య బృందాల ప్రదర్శన, 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, 30న పోలీసు అమరవీరుల కుటుంబాల్లోని సాధకులకు సన్మానం, 31న సమైక్యతా దినం పాటించి వారోత్సవాలు ముగిస్తారు.

జిల్లాలో పోలీసు అమరులు...

జిల్లాలో పలువురు పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు. అందులో ఏఆర్ కానిస్టేబుల్ (పీసీ 9666) ఆర్.బాబావలి ఒకరు. ఈయన 1992లో విధుల్లో చేరారు. హైదరాబాద్, ఢిల్లీ పోలీస్ కారిడార్‌లో గన్‌మెన్‌గా శిక్షణ పొంది పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు గన్‌మెన్‌గా పనిచేశారు. 2003 జనవరి 18న అనంతపురం పోలీస్ కంట్రోల్ రూం వద్ద గుర్తు తెలియని దుండగులు చేతిలో బాబావలి వీర మరణం పొందారు. ఇక మరొక కానిస్టేబుల్ (పీసీ 2105) తాటిపి చంద్రశేఖర్. ఈయన 1994లోకానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. చిలమత్తూరు, రామగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. 2003 సెప్టెంబర్ 23న చంద్రశేఖర్‌తోపాటు హనుమంతుని సీపీఐ మావోయిస్టు రామగిరి దళం కిడ్నాప్ చేసింది. ఆ తరువాత హనుమంతుని విడుదల చేసింది. మరుసటి రోజు సోమరవాండ్లపల్లి అటవీ ప్రాంతంలో చంద్రశేఖర్ మృతదేహాన్ని పడేశారు. ఇలా మరికొందరు కూడా విధుల్లో చనిపోయిన వారు ఉన్నారు.

పోలీస్ అంటేనే బాధ్యత

పోలీస్ ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నది. అలాంటి పోలీసులు ఒక్కోసారి అసాంఘిక శక్తుల చేతుల్లో వీరమరణం పొందుతుంటారు. కొంతమంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతారు. వారి కుటుంబాలకు అండగా ఉండటంతో పాటు ఏటా పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తుంటాం. సోమవారం పోలీస్ కార్యాలయంలో పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రారంభిస్తాం 10 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తాం. – రత్న, ఎస్పీ

గుంతకల్లు – చిక్‌జాజూర్ ప్యాసింజర్ రైళ్లు రద్దు

గుంతకల్లు: సౌత్ వెస్టన్ రైల్వే పరిధిలోని చిత్రదుర్గ వద్ద రైలు మార్గం పనులు జరుగుతున్నందున గుంతకల్లు–చిక్‌జాజూర్ మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. చిక్‌జాజూర్–గుంతకల్లు–చిక్‌జాజూర్ (07585/ 86) ప్యాసింజర్ రైలు ఈ నెల 20, 22, 23, 24, 25, 27, 29, 30, 31, నవంబర్ 1, 3, 5, 6, 7, 8, 10,12, 13, 14, 15, 17, 19, 20, 21, 22, 24, 26, 27, 28, 29 తేదీల్లోను, అలాగే డిసెంబర్ 1, 3, 4, 5, 6, 8, 10, 11, 12, 13 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆహార పదార్థాలు కల్తీ చేస్తే చర్యలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆహార భద్రతాధికారి తస్లీం

హిందూపురం టౌన్: ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారి తస్లీం హెచ్చరించారు. శనివారం పట్టణంలో పలు దుకాణాల్లో ఆహార పదార్థాలను ఆమె తనిఖీ చేశారు. తయారీ తేదీ లేని కారం పూసిన వేరుశనక్కాల ప్యాకెట్‌ను సీజ్ చేశారు. వివిధ పేర్లతో తయారు చేసిన మిఠాయిలను పరిశీలించారు. కాలం ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది వ్యాపారులు ధనార్జన కోసం ప్రజలు తినే ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారన్నారు. కల్తీలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కృషి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని మాల్యవంతం గ్రామంలో సర్పంచు కుంటాల దేవీ అధ్యక్షతన నిర్వహించిన 'పల్లె పండుగ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెల్లో అభివృద్ధికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.4,500 కోట్లు తీసుకువచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామాల్లో సభలు నిర్వహించి 30 వేల పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహిస్తామని, ఆయా గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను స్థానికులే నిర్ణయించుకోవచ్చన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశగా ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా ఏపీలో మాత్రమే 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు మాల్యవంతం గ్రామంలో ఐదు చోట్ల రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. సమావేశంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, డ్వామా పీడీ విజయ్‌ప్రతాప్, పంచాయతీరాజ్ డీఈ శ్రీరాములు, ఎంపీడీఓ నరసింహనాయుడు, జెడ్పీటీసీ కోటి సుధ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్ ఘన విజయం

- ఆర్డీటీ స్టేడియంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

అనంతపురం : ఆర్డీటీ క్రీడా గ్రామంలో రాజమాత జిజాబాయి ట్రోఫీ –2024 సీనియర్ మహిళల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్ ఒడిశా–లడఖ్ జట్ల మధ్య జరిగింది. ఒడిశా 7 గోల్స్ సాధించగా, లడఖ్ ఒక గోల్ కూడా చేయకుండానే చతికిల పడింది. ఒడిశా తొలి మ్యాచ్‌లోనే ఘన విజయం సాధించి శుభారంభం చేసింది. మధ్యాహ్నం మధ్యప్రదేశ్– అరుణాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య రెండో మ్యాచ్ జరిగింది. ఇందులో మధ్యప్రదేశ్ ఒక గోల్ కూడా చేయలేదు. అరుణాచల్ ప్రదేశ్ 8 గోల్స్ సాధించి ఘన విజయం సాధించింది. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, మాజీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్యారీ

ఇండియన్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్యారీ క్షాక్షా ఒడిశా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్యారీ క్షాక్షా స్టార్ ఫుట్‌బాల్ క్రీడాకారిణిని చూసి అభిమానులు ఆనందించారు. ఆర్డీటీ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ బాగుందని ప్యారీ కితాబిచ్చారు.

వస్త్ర వ్యాపారి ఇంట్లో చోరీ

మడకశిర: పట్టణంలోని శల్య చికిత్స కేంద్రం (ప్రశాంతినగర్) సమీపంలో నివాసముంటున్న వస్త్ర వ్యాపారి సదాశివప్ప ఇంట్లో చోరీ జరిగింది. సదాశివప్ప కుటుంబం రెండు రోజుల క్రితం మైలార లింగేశ్వరస్వామి దైవ దర్శనానికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు చోరీకి పథకం వేశారు. శుక్రవారం రాత్రి ఇంటి వెనుక ఇనుప గ్రిల్స్ ఎక్కి మేడపైకి చేరుకుని తలుపులు పగులగొట్టి లోని ప్రవేశించారు. పూజగదిలోని వస్తువులు అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ రామారావు తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. అక్కడి నుంచే బాధితుడికి ఫోన్ చేసి సమాచారం అందించారు. బాధిత కుటుంబం వచ్చిన తర్వాత బంగారం, వెండి ఆభరణాలు ఇతర వస్తువులు ఏవి చోరీ అయ్యాయనేది తెలుస్తుందని సీఐ తెలిపారు.

పరాకాష్టకు జేసీ కక్షసాధింపు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్షసాధింపు పరాకాష్టకు చేరింది. పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరుకు చెందిన బీవీ భాస్కర్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారు. అప్పటి నుంచి ఈయనపై జేసీ కక్ష పెంచుకున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక భాస్కర్‌రెడ్డిని ఇబ్బందులకు గురి చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా ఆయనకు చెందిన సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలపై కన్ను పడింది. మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారులను తనిఖీల పేరుతో ఉసిగొలిపారు. భవనం శిథిలావస్థకు చేరిందని, విద్యార్థులు ప్రమాదంలో ఉన్నారని, భవనం ఖాళీ చేయించాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి చేయించారు. అయితే భాస్కర్‌రెడ్డి కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తనిఖీల కోసమని కళాశాలకు వచ్చిన న్యాక్ బృందాన్ని జేసీ మందీమార్బలంతో వచ్చి కళాశాలపై వివిధ రకాల ఆరోపణలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రెండోరోజు శనివారం కూడా న్యాక్ అధికారులను అడ్డుకుని అధికార దర్పం ప్రదర్శించారు. అధికారులను కళాశాలలోపలికి వెళ్లకుండా ధర్నాకు దిగారు. స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నించారు. జేసీ దుశ్చర్యలపై ప్రజలు చీదరించుకోవడం కనిపించింది.

వృద్ధుడిపై మందుబాబు దాడి



చికిత్స పొందుతున్న వృద్ధుడు



వృద్ధుడిపై దాడిచేసిన మందుబాబు

హిందూపురం: ఓ వృద్ధుడిపై మందుబాబు విచక్షణారహితంగా దాడి చేశాడు. హిందూపురంలోని గురునాథ్ సర్కిల్ వద్ద రోడ్డుపక్కన ఓ వృద్ధుడు కూర్చున్నాడు. అక్కడకు ఓ మందుబాబు వచ్చి తనకు డబ్బు ఇవ్వాలని అడిగాడు. తాను అడుక్కునేవాడినని.. నీకివ్వడానికి తనవద్ద ఏమీ లేదని చెప్పడంతో మందుబాబు ఆగ్రహించాడు. వృద్ధుడి చేతిలోని కర్రను లాక్కొని విచక్షణారహితంగా చావబాదాడు. మోకాలు, చేతులపై బలంగా బాదాడు. అడ్డుకోబోయిన వాహనచోదకులపైనా వీరంగం వేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించిన తర్వాత.. మందుబాబును పట్టుకుని, తాడుతో కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. కాలు విరిగిన వృద్ధుడిని ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కదిరి అర్బన్: నడింపల్లి వద్ద శనివారం సాయంత్రం బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 21.47 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు. పవన్ అనే వ్యక్తి నడింపల్లి నుంచి కదిరికి బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి, కేసు నమోదు చేశామన్నారు.

గాయపడిన విదేశీయురాలి మృతి



అమెరికన్ లీడా

అనంతపురం: బాత్‌రూంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విదేశీయురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. అమెరికాకు చెందిన లీడా (60) కొంతకాలంగా పుట్టపర్తిలోని సాయి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటోంది. శుక్రవారం బాత్‌రూంలో ప్రమాదవశాత్తూ జారిపడటంతో తీవ్రంగా గాయపడింది. పుట్టపర్తి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం సర్వజనాస్పత్రి అత్యవసర విభాగంలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో లీడా శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఒక్క సెంటూ ఆక్రమణకు గురికానివ్వం'

- 'తమ్ముళ్ల' దురాక్రమణపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



దళితుల శ్మశానవాటికను సర్వే చేస్తున్న అధికారులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ ఎదురుగా ఉన్న 'దళితుల శ్మశాన వాటిక' భూమిలో ఒక్క సెంటూ ఆక్రమణకు గురికానివ్వమని పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు పరిటాల సిద్దార్థ్ పేరు చెప్పుకుని కొందరు టీడీపీ కార్యకర్తలు దళితుల స్మశాన భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారు. జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకున్న దళితులను పరిటాల సిద్దార్థ్ పేరు చెప్పి బెదిరించిన విషయాన్ని శనివారం 'అన్న చెప్పాడు.. ఆక్రమిస్తున్నాం!' శీర్షికతో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, వీఆర్ఓ వెంకట మంజు, సర్వేయర్ అసిస్టెంట్ రామకృష్ణ శ్మశానవాటిక వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడుతూ ఏదైనా ఉంటే సిద్దార్థ్ అన్నవద్దకు వచ్చి మాట్లాడుకోండంటూ తెలిపారని అధికారులకు వివరించారు. అనంతరం సర్వేయర్ అసిస్టెంట్ సర్వే చేయగా.. మొత్తం శ్మశానస్థలానికి కేటాయించిన భూమి 1.70 ఎకరాల ఉన్నట్లు గుర్తించి హద్దులు నాటారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. శ్మశాన స్థలం దురాక్రమణకు గురి కాకుండా అండగా నిలిచిన 'సాక్షి'కి దళితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బెదిరింపులకు పాల్పడితే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలి..

కబ్జా విషయంపై అనంతపురం రూరల్ మండల టీడీపీ నాయకులు కూడా స్పందించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మేకల వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పాముదాయి రఘు మాట్లాడారు. పరిటాల కుటుంబం పేరుచెప్పి ప్రజలను ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, ఇబ్బందులకు గురి చేసినా బాధితులు నేరుగా ఎమ్మెల్యే పరిటాల సునీత లేదా ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్తుల విషయంలో ఎవరు జోక్యం చేసుకున్నా పరిటాల కుటుంబం ఉపేక్షించదని హెచ్చరించారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



దీపాలు పెడుతున్న మహిళలు

ఖాద్రీశా.. నమోనమః

కదిరి టౌన్: శ్రీవారి నామస్మరణతో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రతిధ్వనించింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశున్ని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యారంగం నిర్వీర్యం

- 'తల్లికి వందనం'కు సర్కార్ ఎగనామం



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్ర

అనంతపురం కార్పొరేషన్: విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మండిపడ్డారు. శనివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన అవుతుందని ముందుచూపుతో తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రవేశపెట్టి.. 45 లక్షల మంది తల్లులకు రూ.12 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. విద్యా, వసతి దీవెన అందించారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15వేలు చొప్పున ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలవుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ పథకం అమలు చేయకుండా ఎగనామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.